క్లుప్తంగా

14న ధర్నా

గుమ్మలక్ష్మీపురం: ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యతిరేక విధానాలను నిరసిస్తూ అన్ని మండలాల్లోని తహసీల్దారు కార్యాలయాల వద్ద ఈ నెల 14వ తేదీన ధర్నా నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి వేణు ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. ఈ నెల 8వ తేదీన ప్రారంభమైన ఈ కార్యక్రమంలో పాల్గొంటున్న నాయకులు.. ఇంటింటికీ వెళ్లి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను మోసగిస్తున్న తీరును వివరిస్తున్నారు. ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలపై ఆర్థికభారం నెట్టే చర్యలు తీసుకుంటున్నారని చెబుతున్నారన్నారు.

టేకు ప్లాంటేషన్ పరిశీలన



మొక్కలను పరిశీలిస్తున్న కురుపాం అటవీ రేంజర్ గంగరాజు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట, పి.ఆమిటి అటవీ శాఖల పరిధిలో చేపట్టిన టేకు మొక్కల ప్లాంటేషన్‌ను కురుపాం అటవీ రేంజర్ డి.గంగరాజు శనివారం పరిశీలించారు. నాటిన మొక్కలు ఎలా ఉన్నాయి.. వాటి సంరక్షణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. అక్రమంగా అడవుల్లో చెట్లు నరకడం, కలప దుంగలను తరలించడం వంటివి చేస్తే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట బీట్ ఆఫీసర్లు ఎన్.రామారావు, నీలామణి తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే.. తన మాట నిలబెట్టుకోవాలి..



అభ్యుదయ రైతు కండాపు ప్రసాదరావు

పాలకొండ రూరల్: అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రాంత రైతులకు సాగునీరు అందిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన ప్రస్తుత ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, టీడీపీ ఇన్‌చార్జ్ పడాల భూదేవి తమ మాట నిలబెట్టుకోవాలని అభ్యుదయ రైతు కండాపు ప్రసాదరావు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల సమయంలో నేటి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో కలసి పాలకొండ బహిరంగ సభలో ఇచ్చిన హామీల్లో ఒకటైన తోటపల్లి ఆధునీకరణ, ట్రైలెండ్ భూములకు సాగునీరు అందించడం, తదితర హామీలు అమలు చేయాలన్నారు. నియోజకవర్గంలోని జనసేన, టీడీపీ నాయకులు ఒకరిపై మరొకరు తమ అధినాయకుల వద్ద ఫిర్యాదులు చేసుకోవడంలో చూపిస్తున్న శ్రద్ధ రైతుల సమస్యల పరిష్కారం, ఇచ్చిన హామీల అమలుపై చూపాలని కోరారు.

పండ్లు, పాలు పంపిణీ



గర్భిణులకు పండ్లు, పాలు అందజేస్తున్న సర్పంచ్ శైలజ

కొమరాడ: మండలంలోని కూనేరు రామభద్రపురం, కొమరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విక్రంపురం సర్పంచ్ కళింగి శైలజ ఆధ్వర్యంలో గర్భిణులు, రోగులకు పండ్లు, పాలు శనివారం పంపిణీ చేశారు. ఏటా కార్తీకమాసంలో పవిత్రమైన రోజుల్లో గర్భిణులు, రోగులకు ఇలా పండ్లు, పాలు దానం చేస్తామని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో కళింగి మల్లేశ్వరరావు, సత్యసాయి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలను గౌరవించాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నీలకంఠం

కొమరాడ: ప్రతిఒక్కరూ మహిళలను గౌరవించాలని ఎస్‌ఐ కె.నీలకంఠం సూచించారు. మండల కేంద్రంలోని ప్రజలకు సత్ప్రవర్తనపై శనివారం అవగాహన కల్పించారు. మంచి నడవడికను అలవర్చుకోవాలని, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు. అలాగే మైనర్ బాలకల పట్ల కూడా తప్పుగా ప్రవర్తిస్తే పోక్సో కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తా రు. భగవంతుడి దర్శనానికి గంటల తరబడి క్యూలైన్‌లో నిల్చొని, మనసారా దైవదర్శనం చేసుకున్నా రు. ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం సుప్రభాతసేవ, మంగళాశాసనం, శాత్తుమురై, తీర్థ ఘోష్ఠి, బాలభోగం, పుణ్యాహవచ నం తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు.

మొక్కజొన్న సాగుకు అదును ఇదే..



దిమ్మిడిజోల వద్ద మొలక దశలో మొక్కజొన్న పంట

- జాగ్రత్తలు తీసుకుంటే అధిక దిగుబడులు ఖాయం
- వ్యవసాయాధికారులు

భామిని:

పంటల మార్పిడిలో భాగంగా రైతులు వరికి ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న సాగుపై దృష్టి సారిస్తున్నారు. ఈ పంట ఏడాదికి రెండు సార్లు వేసుకోవచ్చు. వర్షాధారంగాను, సాగునీటి కింద కూడా పండించే అవకాశం ఉండడంతో ఎక్కువ మంది రైతులు సాగుకు ముందుకు వస్తున్నారు. ప్రస్తుతం రబీ సీజ‌న్‌లో సాగు చేపడుతున్నారు. జూన్, జూలైలో వేసిన మొదటి పంట వచ్చేసింది. నవంబర్, డిసెంబర్‌లో రెండో పంట వేయడానికి రైతులు సన్నద్ధం అవుతున్నారు. ఇప్పటికే వ్యవసాయాధికారులు కూడా పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మొక్కజొన్నపై విస్తృత ప్రచారం చేస్తున్నారు. దీర్ఘకాల రకాలైతే 100–120 రోజులకు పంట చేతికొస్తుందని.. మధ్య రకాలైతే 90 –100 రోజులకు.. స్వల్పకాలిక రకాలైతే 90 రోజుల్లోపే పంట చేతికొస్తుందని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో సాగుకు సంబంధించిన పలు విషయాలు వివరించారు.

ఎరువుల వినియోగం..

ఎకరానికి సంకరజాతి విత్తనాలైతే ఏడు నుంచి ఎనిమిది కిలోల విత్తనం సరిపోతుంది. ఎకరానికి 72–80 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం, 20 కిలోల పోటాష్‌నిచ్చే ఎరువులు వాడాలి. మొత్తం ఎరువులు పంట విత్తే సమయంలోనే వేసుకోవాలి. ఒకవేళ జింక్ లోపం ఉంటే ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్ వేయాలి. పైరుపై జింక్‌లోపం గమనిస్తే జింక్ సల్ఫేట్ 20 గ్రాములను లీటర్ నీటిలో కలుపుకుని సరిపాడా పిచికారీ చేసుకోవాలి.



పసుకుడి వద్ద పంటపై మందు పిచికారీ చేస్తున్న రైతు

కలుపు నివారణ..

పంట విత్తాక 45 రోజుల వరకు కలుపు లేకుండా చూసుకోవాలి. మొక్కజొన్న పంటను ఏక పంటగా వేసినప్పుడు నేల రకాన్ని బట్టి ఎకరాకు 800 –1200 గ్రాముల అట్రాజిన్ పొడి మందును 200 లీటర్ల నీటిలో కలిపి పంట వెంటనే లేదా రెండు,మూడు రోజుల్లోగా పిచికారీ చేసుకోవాలి. వెడల్పాటి కలుపు మొక్కల నివారణకు విత్తిన 30 రోజుల తర్వాత ఎకరానికి అర కిలో 2.4–డి సోడియం సాల్ట్‌తో పిచికారీ చేసుకోవాలి.

నీటి తడులు..

వర్షాధారంగా సాగు చేసినా పూత దశలో వర్షాభావ పరిస్థితులేర్పడితే వీలున్న చోట నీరు తడిపితే మంచి దిగుబడులు వస్తాయి. పూత దశ, గింజలు ఏర్పడే దశల్లో నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి. పైరు తొలి దశలో పొలంలో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

సస్యరక్షణ తప్పనిసరి..



పైరు తొలి దశలో ఆశించే మొవ్వ తొలిచే పురుగు నివారణకు ముందు జాగ్రత్తగా విత్తిన 10–12 రోజులకు పైరుపై మోనోక్రోటోఫాస్ 1.6 ఎం.ఎల్ లేదా కోరాలిన్ 3 ఎం.ఎల్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. లేదా కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను ఎకరాకు 3 కిలోలు చొప్పున పైరు 25–30 రోజుల దశలో ఆకుసుడుల్లో వేయాలి. ఆకుమాడు తెగులు నివారణకు మాంకోజెబ్ 2.5 గ్రాములు లీటర్ నీటిలో కలిపి వారం, పది రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. పొడతెగులు లక్షణాలు కనిపిస్తే మొక్క దిగువనున్న 2.3 ఆకులు తుంచి, ప్రొపికోనజోల్ ఎం.ఎల్ లీటర్ నీటిలో కలిపి పిచకారీ చేయాలి.

– కొర్ను సింహచలం, మండల వ్యవసాయాధికారి, భామిని

అప్రమత్తంగా ఉండాలి



లింక్ రోడ్డును పరిశీలిస్తున్న ఎస్‌ఐ రమేష్‌నాయుడు

గరుగుబిల్లి: దొంగతనాలు, దారి దోపిడీలు జరుగుతున్న నేపథ్యంలో ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ పి.రమేష్‌నాయుడు సూచించారు. మండలంలోని ఉల్లిభద్ర రహదారిని ఆనుకుని ఉన్న లింక్ రోడ్డును ఆయన శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీన దళాయివలసకు చెందిన మహిళ మెడలోని బంగారు ఆభరణాలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారని తెలిపారు. దొంగలు తమ బైక్‌పై లిఫ్ట్ ఇస్తామని చెప్పి ఆమె ఆభరణాలను దోచుకోవడం జరిగిందన్నారు. అవసరమైతే తెలిసిన వాళ్ల వాహనాలను మాత్రమే ఎక్కాలని, అపరిచితుల వాహనాలను ఎక్కవద్దన్నారు.

ఓటరు జాబితాలోని తప్పులు సవరించుకోవాలి



ప్రత్యేక ఓటర్ల నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌ఐ శ్రీనివాస్ గౌరీప్రసాద్

గరుగుబిల్లి: ఓటరు జాబితాలో ఏవైనా తప్పులుంటే వాటిని సవరించుకోవాలని ఆర్‌ఐ శ్రీనివాస్ గౌరీప్రసాద్ సూచించారు. మండలంలోని గొట్టివలస పోలింగ్ కేంద్రాన్ని శనివారం సందర్శించిన ఆయన బీఎల్‌వోలకు పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు అందుబాటులో ఉండి, ఓటరు వివరాల్లోని తప్పులను వారి అభ్యర్థన మేరకు సరిచేయాలని తెలిపారు. మండలంలోని 49 పోలింగ్ కేంద్రాల్లో రెండు రోజుల పాటు ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం కొనసాగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీఎల్‌వో పి.శిరీష, తదితరులు పాల్గొన్నారు.

అక్షరంపై అక్కసు తగదు..

- ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు



వీరఘట్టం: ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తూ, వాటి పరిష్కారానికి ఎంతో కృషి చేస్తున్న సాక్షి పత్రిక ప్రతినిధులపై, సాక్షి సోషల్ మీడియాపై కూటమి ప్రభుత్వం అక్కసుతో వ్యవహరిస్తోందని ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రజల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న పత్రికలపై అక్రమ కేసులు పెట్టి కలం గొంతు నొక్కితే సమాజానికి చాలా ప్రమాదకరమన్నారు. ఇటువంటి చర్యలు మానుకోవాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

సీతంపేట: మండల సర్వసభ్య సమావేశం ఆదివారం స్థానిక వైటీసీలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.గీతాంజలి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

నేడు లక్ష దీపారాధన

సీతంపేట: మండలంలోని ముక్కిడి పోలమ్మగుడి వద్ద ఆదివారం లక్ష దీపారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభం కానున్న ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించాలని కోరారు.

పూర్తయిన తారురోడ్లు..



గురండి- నేరడి రోడ్డుకు భూమి పూజ చేస్తున్న అప్పటి ఎమ్మెల్యే వి.కళావతి (ఫైల్)



పూర్తయిన గురండి-నేరడి తారురోడ్డు

భామిని: మారుమూల గ్రామాలకు పక్కారోడ్లు లేక ఇబ్బందులు పడుతున్న సమయంలో నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా.. ప్రస్తుతం ఆ రోడ్లన్నీ పూర్తయ్యాయి. మండలంలోని గురండి నుంచి నేరడి–బికి వెళ్లే రహదారి దశాబ్దాలుగా అధ్వానంగా ఉండేది.. ఈ రోడ్డు నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి రూ. 63 లక్షలు మంజూరు చేయడంతో పాటు ఈ ఏడాది ఏప్రిల్‌లో పనులకు శంకుస్థాపన కూడా చేశారు. అలాగే కోసిమానుగూడ–జియ్యమానుగూడ రోడ్డు పనులకు కూడా శంకుస్థాపన చేసి రూ. 1.5 కోట్లు మంజూరు చేయించారు. అప్పట్లో ఎన్నికల కోడ్ నిబంధనలతో పనులు నిలిచిపోగా.. ప్రస్తుతం ఆ రోడ్ల పనులు పూర్తి కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జల్‌జీవన్ పనులు వేగవంతం



బొమ్మిక వద్ద పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న డీఈఈ మధుసూదనరావు, ఏఈ సందీప్

భామిని:

మండలంలోని 54 గ్రామాలకు తాగునీరు అందించే జల్‌జీవన్ నీటి పథకం పనులు వేగవంతం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ఆర్.మధుసూదనరావు అన్నారు. ఏఈఈ అలికాన సందీప్‌తో కలిసి బొమ్మిక, సింగిడి, బురుజోల గ్రామాల వద్ద జరుగుతున్న జల్‌జీవన్ పైప్‌లైన్ నిర్మాణ పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు



ఎక్సైజ్ అధికారుల అదుపులో నిందితుడి వాహనం

పాలకొండ రూరల్: మండలంలోని నాగావళి నదీ తీరంలో గల గ్రామాల సరిహద్దుల్లో శనివారం రాత్రి స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు పహరా నిర్వహించినట్లు ఆ శాఖ సీఐ కె.సూర్యకుమారి తెలిపారు. ఈ క్రమంలో కలివరపు వెంకటరమణ అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనంపై అక్రమంగా తీసుకువెళ్తున్న 25 మద్యం బాటిళ్లను అధికారులు గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని వాహనం, బాటిళ్లు సీజ్ చేసి కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

ఇది ముమ్మాటికీ ప్రభుత్వ నిర్లక్ష్యపు హత్యే!

- గిరిజన విద్యార్థి మృతిపై మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి వ్యాఖ్య



విద్యార్థి మృతి వివరాలు అడిగి తెలుసుకుంటున్న మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి

గుమ్మలక్ష్మీపురం(జియ్యమ్మవలస): జియ్యమ్మవలస మండలంలోని రావాడ రామభద్రపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థి జీవన్‌కుమార్ మృతి ఘటనపై మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి ఆరాతీశారు. శనివారం ఆ పాఠశాలను సందర్శించిన ఆమె.. విద్యార్థి ఏ విధంగా చనిపోయాడన్న దానిపై వివరాలు సేకరించారు. విద్యార్థి మరణం చాలా బాధాకరమని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ నిర్లక్ష్యపు హత్యేనని ఆమె విమర్శించారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి తూతూమంత్రంగా పర్యవేక్షించారే తప్ప చర్యలు లేవన్నారు. ఏఎన్‌ఎంను నియమిస్తామని మంత్రి తొలి సంతకం చేశారే కానీ ఆ దిశగా చర్యలు శూన్యమని విమర్శించారు. మాట్లాడే విధానం కూడా రాని వారికి మంత్రి హోదా ఇవ్వడం హాస్యాస్పదమన్నారు. తానెన్నడూ రాజకీయ జీవితంలో ఇలాంటి మంత్రిని చూడలేదని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఒక్క కురుపాం నియోజకవర్గంలోనే ఏడుగురు విద్యార్థులు మరణించారని, చర్యలేవీ అని నిలదీశారు. నిత్యం ప్రతీదానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముడిపెట్టి, నిందించడం తగదన్నారు. ముందు శాఖపై పట్టుతెచ్చుకోవాలని హితవుపలికారు. భవిష్యత్‌లో విద్యార్థుల మరణాలు సంభవించకుండా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లోలుగు నారాయణరావు, బలగ వెంకటరమణ, కడ్రక బలరాం, మరడాన కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

సందేశాత్మకంగా నాటిక పోటీలు



జియ్యమ్మవలస మండలం, పెదమేరంగి కూడలిలో ఉన్న శ్రీసత్యకైలాష్ పాఠశాల ఆవరణలో శుక్రవారం రాత్రి ప్రారంభమైన నాటిక పోటీలు సందేశాత్మకంగా కొనసాగుతున్నాయి. శ్రీకాకుళం, హైదరాబాద్ కళాకారుల బృందం వారు వేసిన మతమా.. మానవత్వమా.., రైతే రాజు నాటికలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఆదివారం వరకు జరిగే ఈ పోటీలను చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పోటీపడుతున్నారు. నాటిక పోటీల ముగింపు రోజున విజేతలను ప్రకటించి, బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు రౌతు వాసుదేవరావు తెలిపారు.

–జియ్యమ్మవలస

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి..



పాలకొండ – వీరఘట్టం రహదారిలో పలు చోట్ల భారీ మలుపులు ప్రమాదకరంగా మారాయి. ముఖ్యంగా తంపటాపల్లి, తుమరాడ, అట్టలి సమీపంలో గల మలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ గ్రామాల మీదుగా పార్వతీపురం, రాయగడ, జేకే పేపర్ మిల్లుకు కలప తరలించే భారీ వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

– పాలకొండ రూరల్

అద్వితీయం..



పవిత్ర కార్తీకమాసంలో కోటి సోమవార పుణ్యఫల పూజలను పురస్కరించుకుని భక్తులు శివాలయాలకు పోటెత్తారు. తిథి, నక్షత్రాలను అనుసరించి శనివారం ప్రత్యేక పూజలు చేపట్టారు. మండలంలోని తంపటాపల్లిలో కొలువుదీరిన ఉమామహేశ్వర, వీరభద్రస్వాముల ఆలయంలో విశేష పూజలు జరిగాయి. ఏక కాలంలో ఒకే పానమట్టంపై ద్వితీయ లింగ రూపాల్లో దర్శనమిచ్చే స్వామికి భక్తులు మనసారా దర్శించుకున్నారు.

– పాలకొండ రూరల్

ఊపందుకున్న వరి కోతలు



గరుగుబిల్లి మండల వ్యాప్తంగా వరి కోతలు ఊపందుకున్నాయి. పెద్దూరు, గరుగుబిల్లి, బీవీపురం, ఉద్దవోలు, చినగుడబ, పెదగుడబ తదితర గ్రామాల్లో ఉదయాన్నే పొలాలకు చేరుకుంటున్న రైతులు కూలీలతో వరి కోతలు చేపడుతున్నారు. మరోవైపు కోసిన చేనును నూర్పిడి కోసం కల్లాలకు తరలిస్తున్నారు. పంట ఆశాజనకంగానే ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

–గరుగుబిల్లి

తాగునీరు వృథా..



నగర పంచాయతీలో సీజన్‌తో సంబంధం లేకుండా తాగునీటి సమస్య వేధిస్తుంది. దాదాపు 40 వేల జనాభా గల పట్టణంలో 20 వార్డుల పరిధిలో 135 పైచికులు వీధులున్నాయి. ప్రజావసరాల నిమిత్తం సుమారు 270 వీధి కుళాయిలు, మరో 1140 వరకు వ్యక్తిగత కుళాయిలున్నాయి. అయితే పైప్‌లైన్లు పాతవి కావడం.. కుళాయిలకు ట్యాప్‌లు లేకపోవడంతో తాగునీరు వృథాగా పోతోంది. అధికారులు స్పందించి తాగునీటి వృథాను అరికట్టాలని నగర ప్రజలు కోరుతున్నారు.

– పాలకొండ రూరల్

సక్రమంగా విధులు నిర్వహించాలి

పాలకొండ: బీఎల్‌ఓలు సక్రమంగా విధులు నిర్వహించాలని తహసీల్దార్ బాలమురళీకృష్ణ ఆదేశించారు. ఓటర్ల జాబితాపై శనివారం ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీఎల్ ఓలు రెండు రోజుల పాటు తమ బూత్ పరిధిలో ఓటర్ల జాబితాల్లో చేర్పులు, మార్పులపై దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు.